వర్గీకరణపై నిరసన సెగ

భారత్ బంద్ ప్రశాంతం, పాక్షికం సెలవు ప్రకటించిన విద్యా సంస్థలు

మచిలీపట్నంటౌన్: ఎస్సీ వర్గీకరణకు అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ మాల కులస్తులు చేపట్టిన భారత్ బంద్ బుధవారం మచిలీపట్నంలో పాక్షికంగా జరిగింది. వర్గీకరణ వ్యతిరేక పోరాట సంఘం నాయకులు కార్యకర్తలు ఉదయమే ఆర్టీసీ బస్టాండ్ చేరుకుని కొన్ని సర్వీసులను బయటకు రాకుండా అడ్డుకున్నారు. దాదాపు 12 ఆర్టీసీ సర్వీలను అడ్డుకోవడంతో డిపోకు రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల తర్వాత డిపో నుంచి ఇతర ప్రాంతాలకు అన్ని బస్సు సర్వీసులు తిరిగాయి. విద్యాసంస్థలు ముందుగానే సెలవు ప్రకటించాయి. పాఠశాలలు, కళాశాలలు మూతపడ్డాయి. వాణిజ్య సంస్థలు, ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలు యథాతథంగా పనిచేశాయి. వాహనాలు తిరిగాయి. క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు (జానీ) మాట్లాడుతూ క్రిమిలేయర్‌ను అమలు చేయడం వల్ల రాను రాను రిజర్వేషన్లే పోయే ప్రమాదం ఉందన్నారు. వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు ఎగ్గొని గాంధీ, బూరగ రామారావు, ఉచ్చుల గణేష్, ప్రత్తిపాటి ప్రేమ్ కుమార్, చైతన్య, లంబ అప్పారావు నాయకత్వం వహించారు.

కృత్తివెన్ను: బంద్ మండలంలో జై భీమ్ సంఘాలు, పలువురు బందును విజయవంతం చేశారు. జై భీమ్‌ఆర్మీ అధ్యక్షుడు హేమాచలం, గౌరవ అధ్యక్షుడు గాదేరాజు, వెంకటరత్నం, గోపీ, నాగేశ్వరరావు, ఏసు, మోజేస్ ఉన్నారు.

కోడూరు: మండలంలో మాల మహానాడు, ఎస్సీ కుల సంఘాలు ముందస్తుగానే ప్రచారం చేయడంతో బంద్‌కు ప్రజలందరూ స్వచ్ఛందంగా సహకరించారు. ప్రైవేటు విద్యాసంస్థలు సెలవు ప్రకటించాయి. ఎస్సీ నేతలు పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులకు బంద్ నోటీసు ఇచ్చి విద్యార్థులను ఇళ్లకు పంపించారు. వాణిజ్య బ్యాంకుల్లో ఒకపూట కార్యకలాపాలు నిలిచిపోయాయి. మధ్యాహ్నం 12గంటల వరకు ఆటో యూనియన్లు సహకరించారు. ఎస్ఐ శిరీష సిబ్బంది బంద్‌ను పర్యవేక్షించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్, నేతలు బత్తుల రాజు, రాజకుమార్, పరసాబత్తిన అరవింద్, బొంతు నవభరత్, పాల్గొన్నారు.

పెడన: పెడనలో బంద్ ప్రశాంతంగా జరిగింది. వైఎస్సార్ సీపీ నాయకులు, తొమ్మిదో వార్డు కౌన్సిలర్, అంబేడ్కర్ కమిటీ నాయకుడైన గరికిపాటి చంద్రబాబు ఆధ్వర్యంలో పట్టణంలో దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల లకు వెళ్లి శాంతియుతంగా వారికి పరిస్థితి వివరించి బంద్‌కు సహకరించాలని కోరుతూ మూయించారు. టీడీపీ నేత కమ్మగంటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సంఘ నాయ కులు కూడా వేరుగా బంద్‌లో పాల్గొన్నారు. సీఐ కె.నాగేంద్రప్రసాద్, ఏఎస్ఐ సురేష్‌కుమార్, లక్ష్మణ్ పర్యవేక్షించారు.


మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారిపై ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ మానవహారం

నాగాయలంక: ఎస్సీల వర్గీకరణ అంశంపై ఆగస్టు 1న భారత సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమంటూ దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నాగాయలంకలో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దళిత నాయకులు, కార్యకర్తలు గ్రామంలోని ప్రధాన వీధుల్లో తిరుగుతూ దుకాణాలు మూసి వేయవలసిందిగా కోరుతూ బంద్ పర్యవేక్షించారు. దీంతో వ్యాపార సంస్థలు మూతపడ్డాయి. బంద్ నిర్వాహకులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పతాకాలను చేతబూని నినాదాలు చేస్తూ ప్రదర్శన జరిపారు. మొత్తం మీద బంద్ పాక్షికంగా ప్రశాంతంగా ముగిసింది. పలువురు దళిత నాయకులు మాట్లాడుతూ 341 ఆర్టికల్‌ను పార్లమెంట్‌లో సవరించకుండా రాజ్యాంగం, చట్టాలకు వ్యతిరేకంగా సుప్రీం తీర్పు ఇవ్వడాన్ని తాము నిరసిస్తున్నామని పేర్కొన్నారు. బంద్ నిర్వహణ కార్యక్రమంలో బడుగు ప్రేమ్‌కుమార్, మండాల బాబు వరప్రసాద్, తానంకి వేణు, మద్దూరి మహేష్, దీకుళ్ళ నవీన్ తదితర దళిత సంఘాల నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.


నాగాయలంకలో ర్యాలీ నిర్వహిస్తున్న దళిత సంఘాల నేతలు


బంటుమిల్లి అంబేడ్కర్ సెంటర్లో నిరసన తెలుపుతున్న జైభీం దళిత సంఘ సభ్యులు


మచిలీపట్నం బస్టాండ్ సెంటర్లో ఆందోళన చేస్తున్న మాల సంఘం నాయకులు

మోపిదేవి: మోపిదేవిలో బుధవారం బంద్ నిర్వహించారు. ప్రభుత్వ, ప్రయివేటు, విద్యా సంస్థలు, వాణిజ్య సంస్థలు బంద్‌కు సహకరించాయి. ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ చేపట్టిన భారత్ బంద్ కార్యక్రమంలో ఎటువంటి సంఘటనలు జరగకుండా అవగనిగడ్డ డీఎస్పీ మురళీధర్ బంద్ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఎస్ఐ వైవీ సత్యనారాయణ పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

బంటుమిల్లి: జై భీం దళిత సంఘం ఇచ్చిన పిలుపు మేరకు మండలంలో భారత్ బంద్ విజయవంతమైంది. ఉదయం నుంచి కార్యకర్తలు ర్యాలీ చేసి ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, పాఠశాలలు మూయించారు. ఆర్టీసీ బస్సులు మధ్యాహ్నం వరకు తిరగలేదు. మండల ఉపాధ్యక్షుడు ఒడిమి చిన్నారిబాబు, సర్పంచ్ జి.బాలస్వామి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ పి.బాబూరావు, కె.సాగర్, ఎం.నరేష్, డి.సాంబశివరావు, కిషోర్, పలు గ్రామాల జై భీం దళిత సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గూడూరు: గూడూరులో అఖిల పక్ష ఎస్సీ నాయకులు కారుమంచి కామేశ్వరరావు, గోపి నాగబాబు, నేతల కుటుంబరావు, వేముఆనంద్, మద్దాల పవన్‌కుమార్, మణికంఠ, శాంసన్ దుకా ణాలు, వాణిజ్య సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు మూయించారు. జాతీయ రహదారిపై ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో మానవహారం ఏర్పాటు చేసి, సుప్రిం కోర్టు నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు. లింగం విజయ్, ఊసా స్వామి, లోకేష్, శివ, జాని, వినయ్, సజీవ్ పాల్గొన్నారు.

అవనిగడ్డ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుని నిరసిస్తూ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ అవనిగడ్డ, చల్లపల్లి మండలాల్లో ప్రశాంతంగా జరిగింది. మాలమహానాడు, అంబేడ్కర్ యువజన సంఘాలు, జైభీం భారత్ పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో ఆయా సంఘాలు, పార్టీల నాయకులు బంద్‌ని పర్యవేక్షించారు. నాయకులు మాట్లాడుతూ 341 ఆర్టికల్ సవరణ జరగకుండా రిజర్వేషన్ల వర్గీకరణపై తీర్పు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమన్నారు.


అవనిగడ్డలో బంద్ చేస్తున్న దళిత నేతలు


చల్లపల్లిలో బంద్‌లో పాల్గొన్న ఎస్సీ నేతలు


సంగమూడి పాఠశాల గేటు మూసివేస్తున్న ఎస్సీ నాయకులు


పెడనలో నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు చంద్రబాబు తదితరులు


కోడూరులో బంద్‌ను పర్యవేక్షిస్తున్న ఎస్సీ సంఘాల నేతలు


మోపిదేవి సెంటర్‌లో బంద్ నిర్వాహకులకు సూచనలు చేస్తున్న డీఎస్పీ మురళీధర్

25న ఉచిత కంటి వైద్యశిబిరం

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈనెల 25న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండవ దుర్గాభవాని జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యుల ఆర్థిక సౌజన్యంతో నాగాయలంకలోని మారుతీ విద్యానికేతన్ డిజిటల్ స్కూలు ఆవరణలో ఉదయం గం.9 నుంచి ఒంటి గంట వరకు ఈ శిబిరం జరుగుతుందన్నారు. సంబంధిత నేత్ర వైద్య పరీక్షల వివరాల కోసం మొబైల్ నంబర్లు 94906 36466, 70936 17778లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. శుక్లాలు ఉన్న వారికి కంటి లోపల అద్దాలు అమర్చే ఆపరేషన్‌లు (ఐఓఎల్) శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా చేయిస్తామని శేఖర్ పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్య

పెడన: గత కొన్ని రోజులుగా కడుపులో నొప్పి భరించలేక ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పెడన పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పెడన పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని 19వ వార్డు దక్షిణ తెలుగుపాలెంకు చెందిన గంజాల తిరుపతమ్మ (29) గత కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. ఇంటికి వచ్చిన భర్త సురేష్ భార్య మృతదేహాన్ని కిందికి దించి తిరుపతమ్మ బంధువులకు సమాచారం ఇచ్చారు. తిరుపతమ్మ సోదరుడు ముత్యాల ప్రేమ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

32 మందికి హోమియో మందుల పంపిణీ

పెడన: పాలకొల్లు పట్టణానికి చెందిన ప్రముఖ హోమియో వైద్య నిపుణుడు డాక్టర్ కోసూరి రామ కృష్ణానంద రాజు టెలి కాలింగ్ ద్వారా తన సిబ్బందితో ఉచిత హోమియో మందులను అందజేశారు. బుధవారం పట్టణంలోని బ్రహ్మపురంలో (డాక్టర్ పోదూరు రాజు) శ్రీ రామకృష్ణ పరమహంస హోమియోపతి హాస్పిటల్ ఆధ్వర్యంలో గత 25 రోజులుగా పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లా పరిసర గ్రామాల్లో ఉచిత హోమియో పిల్స్ వైద్య సేవలు నిర్వహిస్తూ రోగులకు ఉచితంగా హోమియో మందులను అందజేస్తున్నట్లు హాస్పటల్ సిబ్బంది పేర్కొన్నారు. హోమియో పిల్స్ వైద్య బృందం 32 మందికి ఉచితంగా డాక్టర్ టెలి కాలింగ్ ద్వారా రోగుల వ్యాధులను తెలుసుకొని దీర్ఘకాలిక వ్యాధులకు సైతం తగిన సలహాలు సూచనలు ఇచ్చి ఉచితం మందులు అందజేశారు.

క్లుప్తంగా

సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలి



పెడన: రైతులు ప్రకృతి వ్యవసాయంపై అసక్తి చూపిస్తూ సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచుకోవాలని, తద్వారా మంచి రాబడి, నాణ్యమైన పంట చేతికి వస్తుందని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ కె.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని నడుపూరులో ఆత్మ సౌజన్యంతో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాల్లో మట్టిని పరీక్షలు చేయించి, తద్వారా సేంద్రియ ఎరువుల వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌సీ ఏవో బి.పద్మజ, ఇన్చార్జి మండల వ్యవసాయ అధికారిణి నూరున్నిసా, నడుపూరు వీఏఏ మంజూష రైతులు తదితరులు పాల్గొన్నారు.

నగర కమిషనర్‌కు సన్మానం



మచిలీపట్నంటౌన్: నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ వీవీఎస్ బాపిరాజును నగరంలోని సచివాలయ ఉద్యోగులు బుధవారం సన్మానించారు. స్వాతంత్య్ర వేడుకల్లో కమిషనర్ బాపిరాజు ఉత్తమ కమిషనర్‌గా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ నుంచి ప్రశంస పత్రం పొందారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు ఆయనను చాంబర్లో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నం పుట్టి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే అశోక్ కుమార్, కునపురెడ్డి రామశేషరావ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృక్షశాస్త్రం (బోటనీ) సబ్జెక్టు బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రేఖారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారు 24వ తేదీన మచిలీపట్నం లేడీ యాంప్తిల్ బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకి హాజరు కావాలని కోరారు.

పోలీస్ స్టేషన్ చెంత.. పట్టపగలు చోరీ



కోడూరు: పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఓ ఇంటిలో దొంగలు పట్టపగలు చోరీకి పాల్పడ్డారు. సేకరించిన వివరాల ప్రకారం.. కోడూరులోని యర్రారెడ్డివారిపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత బండే నాగరాజు తన భార్య బుధవారం తమ పొలంలో వరినాటు వేసేందుకు ఉదయం ఇంటికి తాళం వేసి వెళ్లారు. రాత్రి 7గంటల సమయంలో వీరు ఇంటికి వచ్చి చూసే సరికి నివాస గృహానికి వేసిన తాళాలు పగుల కొట్టి ఉండటాన్ని గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూస్తే బీరువా తాళాలు కూడా పగుల కొట్టి ఉన్నాయి. దీంతో నాగరాజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అవనిగడ్డ సీఐ యువకుమార్, ఎస్ఐ శిరీషలు ఘటనాస్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. బీరువాలో ఉన్న రూ.2.10 లక్షల విలువ చేసే 30 గ్రాముల బంగారంతో పాటు రూ.38 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. అయితే పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఇంటిల్లో పట్టపగలు ఈ ఘటన జరగడం తీవ్ర కలకలం రేపింది. నిందితుల ఆచూకీ కోసం పోలీసులు సీసీ కెమేరాలను పరిశీలిస్తున్నారు.

పాలకాయతిప్ప బీచ్.. భద్రత తూచ్

- కానరాని హెచ్చరిక బోర్డులు
- కనిపించని పోలీసుల పర్యవేక్షణ
- ఆపదలో ఆదుకుంటున్న చిరు వ్యాపారులు, ఫొటోగ్రాఫర్లు

కోడూరు: హంసలదీవి సాగరతీరంలో పర్యాటకుల ప్రాణాలకు భద్రత కరువైంది. మహాబలేశ్వరంలో ఉద్భవించిన కృష్ణానది హంసలదీవి వద్ద సముద్రంలో కలుస్తుండడంతో ఈ ప్రాంతానికి నిత్యం వేలాది మంది యాత్రికులు తరలివస్తారు. సెలవుదినాల్లో పర్యాటకుల సంఖ్య వేలల్లోనే ఉంటుంది. సముద్రంలో స్నానాలు చేసే సమయంలో పర్యాటకులకు జాగ్రత్తలు చెప్పేవారు కూడా లేరు. దీంతో సముద్ర పరిస్థితులు తెలియక స్నానాలు చేస్తూ సముద్రంలో లోతుకు వెళ్లి ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నెల 18వ తేదీన పాలకాయతిప్ప బీచ్ వద్ద గుడివాడకు చెందిన ఆరుగురు వ్యక్తులు సముద్రంలో మునిగారు. వీరిలో ఒకరు మృతి చెందగా మరొకరి ఆచూకీ లభించలేదు. మిలిగిన నలుగురు వ్యక్తులను మెరైన్ పోలీసులు, చిరువ్యాపారులు, తోటి పర్యాటకులు కాపాడి ఒడ్డుకు చేర్చారు. గత పదేళ్లలో సాగరతీరం ప్రాంతంలో సుమారు 30 మందికి పైగా మృత్యువాత చెందారు.


ప్రమాదాలకు నిలయంగా మారిన హంసలదీవి సాగరతీరం

కానరాని హెచ్చరిక బోర్డులు..

సాగర సంగమం వద్ద ఊహకందని లోతు ఉండడంతో స్నానాలు ఆచరించేందుకు అధికారులు అనుమతి ఇవ్వడం లేదు. దీంతో పర్యాటకులంతా పాలకాయతిప్ప బీచ్ వద్దే సముద్రస్నానాలు చేస్తున్నారు. బీచ్ వద్ద అలల ఉధృతి ఎక్కువగా ఉండడంతో పర్యాటకులు లోతుకు వెళ్లి స్నానాలు చేస్తే ప్రమాదమే. ఇటీవల కాలంలో తుఫాన్లు, వాయుగుండాల ప్రభావంతో బీచ్‌లో భారీ గుంతలు ఏర్పడ్డాయని స్థానిక మత్స్యకారులు అంటున్నారు. సముద్ర స్థితి గతులు, ఇక్కడ పరిస్థితులపై కోడూరు పోలీసులు కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రమాదం జరిగినప్పుడే హడావుడి..

పాలకాయతిప్ప వద్ద మెరైన్ పోలీస్‌స్టేషన్ ఉండడంతో పర్యాటకుల బాధ్యత వారిదేనన్నట్లు కోడూరు పోలీసులు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మెరైన్ పోలీసులు సెలవుల్లో మాత్రమే తీరంలో గస్తీ నిర్వహిస్తున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే హడావుడి చేస్తున్నారు. మిలిగిన రోజుల్లో తీరంలో కనిపించరని పర్యాటకులు విమర్శిస్తున్నారు.

కాసులు ఇస్తేనే కాలువకు నీరు

రైతులతో ఆటలాడుతున్న ఇరిగేషన్ సిబ్బంది

బంటుమిల్లి: మండలంలో బ్రాంచి కాలువల పరిధిలో నాట్లు పూర్తయినా ఒక్క బర్రిపాడు కాలువ పరిధిలో చివరి భూములకు మాత్రం నేటికీ నాట్లు పూర్తికాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బర్రిపాడు బ్రాంచి కాలువపై ముంజులూరు, కంచడం, బర్రిపాడు గ్రామాల్లో సాగు భూములు ఆధారపడి ఉన్నాయి. ప్రస్తుతం బంటుమిల్లి ప్రధాన కాలువకు దాదాపు 500 క్యూసెక్కుల నీరు వస్తుందని అధికారులు చెబుతుండగా బర్రిపాడు బ్రాంచి కాలువకు మాత్రం నీరు రావడం లేదు. దీంతో దమ్ము చేయాల్సిన భూములన్నీ పగుళ్లు ఇచ్చి నీటి కోసం ఎదురు చూస్తున్నాయి. ఈ స్థితిలో ఆయిల్ ఇంజిన్లను ఉపయోగించి పొలాలను తడుపుకుంటున్నామని ముంజులూరు గ్రామ రైతులు తెలిపారు.


నీరు లేక పగుళ్లు ఇచ్చిన పంట పొలాన్ని చూపుతున్న ముంజులూరు రైతులు

ముదిరిపోతున్న నారు..

ప్రస్తుతం ఆయిల్ ఇంజిన్లకు కూడా నీరు అందడంలేదని రైతులు వాపోయారు. నారు మళ్లు పోసి దాదాపు 40 రోజులు దాటిపోవడంతో నీరులేక నారు ముదిరిపోయి మళ్లలో తుంగ (పిచ్చి)మొక్కలు మొలుస్తున్నాయి. ముంజులూరు గ్రామ రైతులు సాగునీటి కోసం నానా తంటాలు పడుతున్నారు. కొంతమంది చెరువు నీటి ద్వార పంటలను కాపాడుకుంటున్నారు. ఇంజిన్లుపెట్టి తోడిన నీరు ఎండలకు మరుసటి రోజుకు ఆవిరైపోతోంది. ఈ కారణంగా పెట్టుబడులు పెరిగి సాగు భారంగా మారిందని పలువురు కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంవత్సరం లంక భూముల్లో దాదాపు 50 ఎకరాలకుపైగా సాగు చేసే అవకాశం లేదని రైతులు విచారం వ్యక్తం చేశారు.

కాసులు ఇస్తేనే సాగునీరు..

బర్రిపాడు బ్రాంచి కాలువకు నీరు రావాలంటే కాలువపై పనిచేసే సిబ్బందికి ముడుపులు చెల్లిస్తేనే నీరు వస్తుందని ముంజులూరు రైతులు ఆరోపించారు. ప్రధాన కాలువలో నీరున్నా నేటికీ బర్రిపాడు బ్రాంచి కాలువలో పూర్తిస్థాయిలో నీరు రాలేదని రైతులు తెలిపారు. నీరు ఎందుకు రావడంలేదని అడుగుతుంటే సిబ్బంది పొంతనలేని సమాధానాలు చెబుతూ రైతులతో దోబూచులాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముడుపులు ఇచ్చుకున్నవారు ముందుగా నాట్లు వేసుకున్నారని దిగువన సుమారు 250 ఎకరాల లంక భూములు సాగు చేస్తున్న కౌలు రైతులు విచారం వ్యక్తం చేశారు. నీటి విడుదలలో నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం ఉందని, పక్షపాత ధోరణ అవలంభిస్తున్నారని, కౌలు రైతులు రామకృష్ణ, వెంకటేశ్వరరావు, రాంబాబు, సుబ్రహ్మణ్యం, బ్రహ్మయ్య ఆరోపించారు.

విచారించి చర్యలు తీసుకుంటాం

బంటుమిల్లి ప్రధాన కాలువకు దాదాపు 500 క్యూసెక్కుల నీరు వస్తుంది. బర్రిపాడు బ్రాంచి కాలువకు ఎందుకు నీరు అందడంలేదో విచారించి నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. నీటి విడుదల కోసం రైతులు ఎవ్వరూ ఎవరికీ డబ్బులు ఇవ్వవలసిన అవసరంలేదు.

–వీ నాగేశ్వరరావు, ఏఈఈ, బంటుమిల్లి సెక్షన్